# ఆమె కోరిక

కొక్కొరో....కో! కొక్కొరోకో! నీరవనిశీథాన్ని చీల్చు కొంటూ, దూరాన కోడికూత. ఇటునుండి అటు ఒత్తిగిల్లేడు అతడు. చెదిరిన నిద్రను కూడగట్టుకొని, బూరుగుదూది తలగడాలో తల ఇముడ్చు కొన్నాడు. ఏవేవో కలలు ఆ సుఖ నిద్రను పాడుచేయ ప్రయత్నిస్తున్నాయి.

విడీ విడని చీకటి తెరలను చీల్చుకొంటూ-ఉషస్సు ప్రవేశిస్తున్నాది. మృదుమధురగానాన్ని వసంత సమీరం మోసుకొస్తున్నాది. నలుదెసల నుండి పక్షులు ఆ గానంతో తమ గొంతులు కలుపుతున్నాయి.

కర్ణపేయంగా గానం గాలిలో కదిలి, వినేవారి హృదిని మధువుతో నింపుతూ, ఏదో అనిర్వచనీయమైన ఆనందాన్ని ఆ చుట్టుపట్టుల నింపుతున్నాది.

'ఎంత చక్కని కల! ఏమి సుందర గానం! ఇటువంటి కలలకు ఏ పరిస్థితులలోనయినా సుస్వాగతమే' అనుకొన్నాడు అతడు విడీవిడని నిద్దుర మత్తులో.

రానురాను ఆ గానంలోని స్వర మాధుర్యమేకాక, అందలి పద లాలిత్యం, ఆ గాయని గాన విశిష్టత ప్రస్ఫుటం కాసాగేయి.

ఎక్కడో, ఎప్పుడో విన్న గొంతుకే. ఒకానొక సమయంలో ఎంతో పరిచితమయిన స్వరంలా అనిపిస్తున్నాది. శాపగ్రస్తమై అతనిలో

నిద్రాణమై ఉన్న ఏ మహానుభూతినో మేల్కొల్ప ప్రభవించిన అమృతవాహినలా, ఆ గానం అతనిలోని చైతన్య స్రవంతిని వెలికి తీస్తున్నాది.

ప్రకృతి నల్లచీర విడిచి, బంగారు చెంగావి చీరధరించింది. అంత వరకు కనుల ముందున్నా కనుగొనలేని అనేక వస్తువులు చూపుమాత్రంగానే సుబోధక మవుతున్నాయి.

ఒక్కసారిగా అతని మగత సడలిపోయింది. 'అవును, తెలిసింది. ఆ పాడుతున్నది శారద' అనుకొన్నాడు.

* * *

విరిసీ విరియని యవ్వన శోభతో, పాల్గారు బుగ్గలతో, లేడిలా బెదురుతూ, ప్రపంచంలోని సిగ్గునంతా తన పెదిమల మధ్య బిగించి పట్టినట్లు ముసిముసి నవ్వులు నవ్వుతూ, తమ ఇంట కాలుమోపిన నవవధువు శారద రూపం కళ్ళకు కట్టింది.

అత్తగారి కొంగు పట్టుకుని అటూ ఇటూ బెదురు చూపులు విసురుతూ అమాయకంగా తిరుగాడు శారదలో అతని కే ప్రత్యేకతా కనుపించనేలేదు అనాడు. ఇల్లు కొత్త, ఇంటిలోని మనుష్యులు కొత్త, సాంసారిక జీవనం కొత్త. ఈ కొత్త తగ్గితే తనూ అందరిలాగే ప్రవర్తిస్తుందనుకొన్నాడు.

రోజులు నెలలుగా మారినా, ఆ కనులలో కదులాడే బెదురు అలానే నిలిచింది. పదిమాటల కొకమాటయినా మారుపలకని ఆమె సిగ్గరితనం చూస్తే అతనిలో విసుపు జనించేది. 'ఇంత అమాయకురాలా ఈమె!' అనుకొన్నాడు. ఆమె పరోక్షంలో ఎన్నో కరకు టూహలు అతనిలో కదలజొచ్చేవి. ఇది మనసివ్వని మనువేమో? హృదయమొకచోట, తనువు ఒకచోటుగా గడిపే జీవనమేమో? లేకుంటే, ఈ ఇరవయ్యో శతాబ్దంలో, పది సంవత్సరాల పసివాళ్ళ ప్రేమపై పాఠాలు అప్పచెప్పుతున్న నేటి

సినీయుగంలో, పుటలకు పుటలు ప్రేమ సాహిత్యం పొంగిపొరలుతున్న నేటి కథానికా యుగంలో ఇంత అమాయకతా!

ఈ ఆలోచనలన్నీ పరోక్షంలోనే. ఆమె చేరువకు చేరగానే, అన్నీ పెనుగాలికి పరుగులుతీసే మేఘ శకలాలలా చెల్లాచెదరు అయిపోయేవి. ఆ కన్నులలో వెలిగే భక్తిభావం, నునుబుగ్గలపై జాలువారుతున్న అనురాగ శోయగం, కదలికలో, మాటలో ప్రతిఫలిస్తున్న ఆమె హృదయమార్దవం అతణ్ణి అశక్తుణ్ణి చేసేవి.

ఆనాడు విందు పూర్ణిమ. బడలిన అతని శరీరాన్ని మల్లెపందిరి పక్కగా అమర్చిన తెల్లనిపానుపు ఆకర్షించింది. ఒడలు పానుపును తాకగానే, కనులలో నిద్ర తాండవించింది.

ఎప్పుడు వచ్చిందో ఆమె! అర్ధరాత్రి మెలకువ వచ్చి చూసేడు అతడు. కటిక నేలపై చెక్కిట చెయ్యిచేర్చి నిద్రిస్తున్నాది. ఒక్కసారిగా ఆమె తెలివితక్కువకు విసుగు, తన మొద్దు నిద్దురకు కోపం జనించాయి అతనిలో.

"శారూ!" కొంచెం కర్కశంగానే ధ్వనించింది అతని కంఠం. త్రుళ్ళిపడి లేచింది శారద. చెదరిన ముంగురులను సరిదిద్దుకొంది. తొలగిన పయ్యెటతో ఒడలు కప్పుకొంది. అడుగుల పడుచీరను ఎత్తి పట్టుకుని మెల్లమెల్లగా పానుపు చెంతకు పదములు కదిపింది ఆమె.

అతని పిలుపులోని కర్కశత్వంగాని, ముఖంలోని విసుగుదలకాని ఆమె నిర్మల ముఖారవిందానికి కాలిమ పులమలేక పోయేయి. పెదవులపై అదే దరహాసం; కనులలో అదే అమాయకత.

"ఇటువంటి పిల్లను ఎలా మందలించడం!" అతను బాధపడ్డాడు. సానునయంగా దగ్గరికి తీసుకొన్నాడు. పూవును చేరిన తావిలా అతని కౌగిలిలో ఒదిగిపోయిగింది ఆమె.

"పతి సన్నిధిలో కటికనేలను అలాపడుకోడం తప్పుకాదా, శారూ॰ ఎవరైనా చూస్తే ఈ చర్యకి ఎన్ని చిలవలు, పలవలు అల్లుతారు? నీవు వచ్చేసరికి నిద్రించేనే అనుకో. ఇంత పెద్ద పక్కపై నీకు స్థలమే లేక పోయిందా? పాలనురుగువంటి పానుపుపై పతి సరసన పడుకోవాలనే కోరికే నీకు కలగలేదా?" అన్నాడు మందలింపుగా.

వేటకాని ఎక్కుపెట్టిన వింటిని చూసి బెదిరిన హరిణ కిశోరిలా ఒక్కసారిగా అతని చూపులతో చూపులు కలిపింది. "మీరు ఎంతో నిర్మలంగా ఏదో తీయని కలలుకంటూ నిద్రపోతున్నారు. నిద్రలో మీ పెదవులపై మెదిలే ఆ మందహాస చంద్రికలని,ఎవరో ఏదో అనుకుంటారని, నా అలికిడితో మలినపరిచే సాహసం నాకు లేకపోయింది" అన్నది భయంగా.

"పిచ్చి, శారూ! కలలో నయినా, జాగృతిలోనయినా నా పెదవుల దరహాసం తెప్పింపగల సామర్థ్యం నీకుమాత్రమే ఉంది" అనుకొన్నాడు అతడు.

* * * *

ఇల్లంతా నిమ్మకు నీరెత్తినట్లు నిశ్శబ్దంగా ఉంది. ఏమీ తోచని వాడిలా నలుదిక్కులా చూసేడు అతడు.

"బాబూ! చిన్నమ్మగారు మేడమీద ఉన్నారు" అన్నాడు అప్పన్న, తన అయోమయ పరిస్థితిని అర్థంచేసుకొని.

ఆ సాయంకాలమే తల్లి అన్నగారింటికి వెళ్ళిందన్న సంగతిని మరిచిపోయినందుకు తనలో తనే నవ్వుకొన్నాడు. అంటే ఇంక మిగిలింది శారూ, తనూ. హుషారుగా ఈలవేసుకొంటూ మేడమెట్లు ఎక్కసాగేడు. సగం దారిలోనే అతడికాళ్ళు ముందుకు కదల మన్నాయి. 'శారు ఇంత అన్యాయం చేస్తుందా? ఎవరా స్నేహితురాలు? పాటయితే బాగుంది.

ఇంకో సమయంలో అయితే తనూ ఆనందించగలిగేవాడు. కాని ఈ పరి స్థితులలో....' మనస్సు కాళ్ళను ముందుకే తోసింది. నా ఇంట్లో నా ఇష్టానికి వ్యతిరేకంగా ఆ స్నేహితురాలు ఎలా వుంటుందో నేనూ చూస్తా నంది అహం.

గుమ్మానికున్న తెర తొలగించి చూసేడు. ఉయ్యాలలో శ్యాం కళ్ళు నులుముతున్నాడు. ఊయల అంచున చెయ్యిచేర్చి తదేక వాత్స ల్యంతో తనయుని ముఖం చూస్తూ పాట పాడుతున్నాది శారద.

"శారద ఇంత చక్కగా పాడగలదా!" ఆశ్చర్యం, ఆనందం అత నిలో పరుగులు తీసేయి. "నా శారద గానవిశారద!" హృదయం గర్వంతో నాట్యమయూరే అయింది.

పాట పూర్తయింది. శ్యాం కళ్ళు మూసేడు, "శారూ!" అతని చేతులూ ఆమెను పొదివి పట్టుకొన్నాయి.

"మీరా!" ఆమె నేత్రాలు అతని ముఖంలో ఏ వెదుకుతున్నాయో?

"నువ్వు ఇంత చక్కగా పాడగలవని నాకు తెలియనేలేదు."

చిరునవ్వే ఆమె సమాధానమయింది.

"ఇంకా ఏం దాచావు నానుంచి?" అనురాగంతో కూడిన ఆవేదన.

"దాచిందికి నాకేం మిగిల్చేరు? కన్నులగాంచిననాడే హృదయ మంతా కొల్లగొని, మాటను కలిపిననాడే మమతనంతా హరించి, ఇంకా ఏం దాచేవని ప్రశ్నిస్తున్నారు. ఎంత గడుసువారు!" అన్నాది ఆమె.

"నీ గానమాధురిని దాచలేదా?"

"దానిలో మీ కాపేక్ష లేదనుకొన్నాను" అన్నాది శారద.

"ఎంత మాటకారి వయేవు, శారూ! పెళ్ళి చూపులనాడైనా పాట పద్యానా అని అడుగలేదనేనా నీ ఫిర్యాదు? మొదటి చూపులోనే నీ కళ్ళతో

నా మనసుకి బంధాలు తగిల్చి వశం చేసుకొన్నావు. ఇంక ఇతర ప్రశ్న లకి నేనంటూ మిగిలితేకదా?"

ఒకనాటి విరిసీ విరియని మొగ్గ, నవవికసిత శిరీషకోమలపుష్పమే అయింది. మాటలలో, చేతలలో, నడతలో పరిణతి నొందిన పక్వఫల మయింది. ఆమె ఆలోచనలను ఆ సోగకనులలోనుండి దొంగిలించే అవ కాశం చేజారిపోయింది అతనికి.

* * *

అవి తిరిగిరాని రోజులు. మరపురాని మధురిమ నందించే ఆ జీవితం వేరు. కాలం మనిషిలో ఎన్నిమార్పులు తెస్తుందని? మనిషిలోని మమతను, మనసులోని కోర్కెలను పక్కకు నెట్టుతుంది కర్తవ్యం. కర్తవ్యం బాధ్యత అనే బురఖా తగిలించుకొంటుంది. పెద్దరికం అనే హోదా పెంచుకొంటుంది.

ఆ పెద్దరికపు పొరలలో సభ్యత, సంస్కారం అనే కార్ఖానాలో యంత్రాలే అవుతారు మానవులు. అదే జీవితం అనే అపోహను పెంచు కొంటారు. ఆ కల్పిత వలయాలను దాటిపోకుండా అడ్డుపడతాయి ఆర్థిక సమస్యలు.అయ్యవారిపని ఆఫీసులోను; అమ్మగారికి వంటింటి సామ్రాజ్యం. మిగిలిన కాలాన్ని హరించేందుకు సకాలంలోనే అవతరిస్తారు పిల్లలు

* * *

ఉదయాన్నే ఆవరించిన ఆలోచనలు జడివానలా ముసురుకొంటు న్నాయి. కళ్ళు తెరిపించిన గానం ఎప్పుడో ఆగిపోయింది.

"విశ్రాంతి జీవనంలోని ఆనందం అంతా ఈ ఒక్కరోజే పూర్తి చేయాలనుకొంటున్నారా? ఇంకా పక్కని వదలలేదు శ్రీవారు" అన్నాది కాఫీకప్పుతో ప్రత్యక్షమయిన శారద.

చేతిలోని దినపత్రికను పక్కగా ఉన్న బల్లపై వుంచి, మంచంపై

కూర్చుంది. ఆలోచనల బరువులో ఆమె ప్రశ్నకు జవాబు చెప్పనే లేదు అతడు. గోముగా అతని ముఖాన్ని తనవైపుకి తిప్పుకొంది ఆమె.

"ఎవరూ?" అతని కళ్ళు ఆనందంతో మెరిసేయి. ఆ మెరుపును ఏనాడో కోల్పోయామనుకొన్నాయి ఆ నేత్రాలు.

"శారూ!" ఆ గొంతులో, ఆ పిలుపులో ఏనాటి గాథలో పరవళ్ళు త్రొక్కేయి.

శారద హృదయం పరవశించింది—మేఘావృతాకాశాన్ని కన్న మయూరిలా; వికసిత మందారాన్ననుభవించిన మధుపంలా.

ఆ పిలుపు ఆమెకు పరిచితమయినదే. కాని, ఆ పిలుపులోని మలుపును అనువదించుకొని అర్థంచేసుకోవేసరికి అనుభవించేందుకు అట్టే కాలం మిగలలేదు.

మధువునంతా మనసున నింపుకొని మధురాజుమనసు రంజింప వికసించింది మొగ్గ. అంతవరకు ఆత్రుతతో ఆ మొగ్గ చుట్టూ సుళ్ళు తిరుగుతున్న మధుపం, ఆ వికసిత పుష్పాన్ని పరివేష్ఠించి ఉన్న కంటక సముదాయాన్ని చూసి జంకుగొన్నాది. ఆ మధువు కంటకాలు కూడా ఆ సుమ జీవన పరిపూర్ణతకు అవసరాలే అని ఆ మత్త మధుపానికేం తెలుసును? సుమబాలను తననుండి ఎవరో వేరుచేస్తున్నారని బాధపడింది.

"పిచ్చి మదుపమా! నా పుట్టుకే నీ కోసం; నా హృదిలో నిండిన మధువంతా నీదే. రా, రా.... పారిపోకు" అని బ్రతిమలాడింది పూబాల.

అవరోధంతో హడిలిన మధుపం వెనుదిరిగి చూడనేలేదు. పూబాల ఎదురుచూస్తూనే వుంది. "ఏదోనాడు మధుపం తప్పక తిరిగివస్తుంది. అంతవరకు ఈ మధువును తనలో నిల్పుకొని అతనికి అందివ్వాలి. అదే తన జీవన సఫలత" అనుకొంది పుష్పం.

శారద కళ్ళలోకి రెప్పవేయక చూస్తున్నాడు అతడు.

"లేవండి. ఏమిటా చూపు, ఎవ్వరయినా చూస్తే నవ్వగలరు. ఇదే

మయినా మీ పట్నవాస మనుకొన్నారా - ఒకరిని గురించి ఇంకొకరు పట్టించుకొనకపోయిందికి? అదిగో, గది తుడవడానికి బుచ్చెమ్మ వస్తున్నాది. వదలండి మరి...."

అతడు అదటుగా ఆమె కొంగును వదిలివేసేడు. నవ్వుతూ వెళ్ళిపోయింది ఆమె.

"ఇదేం మీ పట్నవాసమనుకొన్నారా?" అన్నాది శారద. కాదా? మరి ఈ గది, ఈ పక్క, తనకెంతో పరిచితమయిన ఈ అలంకరణ, ఇదంతా కలా? తనెక్కడ ఉన్నాడు? ఎన్నో సంశయాలు. వాటిని నివృత్తి చేయగల ఆమె అక్కడ లేదు.

ఒక్కసారిగా ఎన్నో పుటలు గిరిగిర తిరిగి, ఒక పేజీదగ్గర ఆగిపోయింది అతని ఆలోచన. అక్కడ ఎవ్వరో బుక్ మార్కుతో గుర్తు పెట్టేరు. ఆ బుక్‌మార్కు అతనికి పరిచితమయిందే కుమార్తె విజయ కుశాగ్రబుద్ధి, విమర్శనాశక్తి చూసి అతడే ఇచ్చేడు.

"ఈ ప్రపంచంలో ఎవ్వరూ పరిపూర్ణులు కాలేరు. ఎంత గొప్పవారికైనా ఏదో లోపం ఉండనే ఉంటుంది. జీవితాలను సరిదిద్దుకొందుకు సద్విమర్శ ఎంతయినా అవసరం. అందులో చిన్నపెద్దల తారతమ్యం ఉండకూడదు. పెద్దలు చెప్పిందల్లా వేదం కాదు; పిన్నలు చేసిందల్లా దూష్యంకాదు. మనిషిలోని మంచిని మంచిగాను, చెడును చెడుగాను ఎంచి చూపగలిగే నేర్పు అందరికి అలవడదు. ఆ అలభ్య వరప్రసాదం నీకుంది. అందుకే నీ తలిదండ్రులచర్యలలో లోపం కనిపించినప్పుడు, విమర్శింపగలిగే హక్కు నీకిస్తున్నాను" అన్నాడు.

కాని ఆ హక్కు ఇంత తొందరలోనే తమజీవిత పుటలలో బుక్ మార్కుగా నిలుస్తుందని అతడు భావించలేదు. అందులో అది శారద విషయమై కావడం మరింత ఆశ్చర్యం కలిగించింది. "అమ్మకు ఇంత

డబ్బు ద్యాస ఉండమకోలేదు" అన్న సంశయాత్మకపదమే ఒక బుక్ మార్కుగా వారి జీవన గ్రంథంలో నిలిచింది.

అతడు, ఆమె తొలి కలయిక నాటినుండి జంటగా వ్రాస్తున్న బృహత్ గ్రంథమది. నేటి సభ్యసమాజంలో భార్యాభర్తలు ఒకరి ఉత్తరాలు ఇంకొకరు చూసుకోరు. ఒకరి డైరీని ఇంకొకరు తాకరు. ఎవరి రహస్యాలు వారివి; ఎవరి ఊహలు వారివి; ఎవరి వ్యక్తిత్వాలు వారివి. జంటగా ఉంటూ ఒంటిగా సంచరించే మనసులు వారివి.

వీరి కలాగేమీ లేదు. చూసిందేదో ఇద్దరూ చూస్తున్నారు. చేసిందేదో ఇద్దరూ చేస్తున్నారు. వ్రాసిందేదో ఇద్దరూ వ్రాస్తున్నారు. రోజు వెనుక రోజుగా, పేజీవెనుక పేజీగా, అనుభూతుల పంక్తులలో, ఆనందావేదనల వర్ణక్రమ తో నిండిపోతున్నాది ఆ గ్రంథం. మధ్య మధ్య అత్తరు పరిమళం గుబాళిస్తున్నాది. అక్కడక్కడ పాత కాగితపు బూజువాసనలు లేకపోలేదు.

ఆ బుక్‌మార్కు వంక అచేవనిగా చూసేడు అతను. ఆ పైన అట్టే పుటలు నల్లబడనేలేదు. అపయినా స్వవిరచితమే శారద వ్రాత మచ్చుకైనా లేదు. అంతా మౌనం....శూన్యం.

"బాబుగారూ! మంగలి వీరిగాడు వచ్చిండు. ఎప్పుడు రమ్మని సెలవు?" పోలాయి గుమ్మంలో నిల్చున్నాడు.

"ఎవరు నువ్వు?" ప్రశ్నించేడు అతడు.

"తమరి పాలికాపోణ్ణి. నన్ను పోలాయంటారు." తన్ను పరిచయం చేసుకొన్నాడు పోలాయి.

"పద. నేనూ వస్తున్నాను" అన్నాడు అతడు. మంచం దిగి పంచె సరిచేసుకొని, పోలాయి వెంట వీధి గుమ్మంలోకి వచ్చేడు.

ఏదో వింత ప్రపంచంలో ఉన్నటు నలువైపులా కలయజూసేడు.

ఇప్పుడు ఎక్కడ ఉన్నానా అని తనను తనే ప్రశ్నించుకొన్నాడు. మన సుకు ఏదో అస్పష్ట సమాధానం దొరికింది.

"పూర్వం ఇక్కడేదో పల్లెలాంటిది ఉండేది కదుటోయి? ఇప్పుడే మయింది?" పోలాయిని ప్రశ్నించేడు.

"ఇక్కడ ఊరెప్పుడూ నేదు బాబూ! తమరు సానాకాలానికి వచ్చినారు. మరిసిపోనారు అదిగో, ఆ దూరంగా సరుగుడు తోటకాడ కవి పిత్తున్న గుడిశలే మీరు సూసిన గామం. ఇప్పుడదికూడా సానా మారి పోనాది నెంది. మునింటి పక్కగా ఓ కామందు డాబా ఇల్లు కట్టినాడు. సుబ్బిసెట్టి పాకపీకి రేకుల సెడ్డేసిండు ఇంకా ఎల్లమ్మ గుడికాడ...."

పోలాయి చూపించినవైపు దృష్టి సారించేడు అతడు. పడమటి గాలికి సరుగుడు చెట్లు తలలూపుతున్నాయి సరుగుడు తోటను వెనుక చేసుకొని పారుతున్న ఏటిలో నీరేమంత ఎక్కువగా లేదు. ఉన్న కాస్త నీళ్ళు సూర్యరశ్మి పడి తళతళ మెరుస్తున్నాయి. ఏటిఒడ్డున చలమలు త్రవ్వి స్త్రీలు నీటిబిందెలు నింపుకొంటున్నారు. చిన్నపిల్లలు తడి ఇసుకలో పిచ్చికగూళ్ళు కట్టుకొంటున్నారు. కొంచెం ఎదిగిన పిల్లలు మోకాళ్ళ లోతు నీళ్ళలో నిలిచి స్నానాలు చేస్తున్నారు. స్నానాలరేవుకు పదిగజాల దూరంలో, ఎంతో ఉత్సాహంగా ఈలవేస్తూ పోతులు కడుగుతున్నాడో కర్షక బాలుడు.

క్రమంగా అతనిదృష్టి ఏరు, ఏటివతల సరుగుడుతోట దాటి గ్రామంలో ప్రవేశించింది. చింతతోపులోంచి గ్రామంలో ప్రవేశిస్తున్నాది వంకలు తిరిగిన నాటుదారి. ఆ దారంటే అతడు, శారద కూర్చున్న బండి రెండుసార్లు నడిచింది మొదట వారి వివాహమై మనుగుడుపులకు పోయి నప్పుడు; రెండవసారి, శారదతండ్రి రామభద్రయ్యగారు కాలంచేసినప్పుడు. ఆ మధ్యకాలంలో శారద అప్పుడప్పుడు వచ్చినా అతను రాలేదు. దానికి

ఇతర కారణాలు ఉన్నా, లేకున్నా పల్లెటూరిలో కాలక్షేపం కాదన్నదే ప్రథమ కారణం.

పుట్టినింట కాలుపెట్టిన శారద కంటికి నల్లపూసే అయిపోయేది. "అక్కయ్యా! వదినా!" అంటూ తోడ తిరిగేనేస్తురాండ్రూ, "అమ్మాయీ! కోడలూ!" అంటూ కుశలప్రశ్నల పేరుతో రోజు రోజల్లా విడిచిపెట్టని దొడ్డమ్మలూ, అత్తయ్యలూ, "చిన్నమ్మగారూ! చిన్నమ్మగారూ!" అంటూ గౌరవాభిమానాలను వెదజల్లే రైతులూ. అబ్బో! అదో రాజ్యం, ఆవిడో రాణి. "మీ పల్లె రాజ్యానికో నమస్కారం. మమ్మల్ని ఇలా పట్నవాసపు మురికిగాలుల మధ్య పడివుండనీ" అనేవాడు అతను.

"మీ రెప్పుడూ ఇంతే; పల్లెటూరిలో ఊసుపోదంటారు కాని, నాకు కాలం ఎంత త్వరగా పరిగెడుతుందని." అనేది ఆ గ్రామీణ యువతి

"అవును. ఎంతటివారికైనా పుట్టి పెరిగిన గడ్డపై ఉండే మమకారం అటువంటిది" అనేవాడు అతడు.

మామగారి మరణంతో ఇంక ఆ ఊరు రా పనే లేకపోయింది అతనికి. తండ్రినుంచి తనకు సంక్రమించిన పొలం, ఇల్లు వగైరాలన్నీ తన బాబాయికి అప్పగించింది శారద. ఆయన జీవించి వున్నంతకాలం పెద్ద పండుగ ముందు జమాఖర్చుల లెక్కలతోపాటు పైకమంతా పంపివేసేవాడు. దేనికెంత అని ప్రశ్నించే అవసరము, శ్రద్ధ వారిద్దరిలో ఎవరికి ఉండేవి కావు. ఇది నా సొమ్ము అని శారద ఏనాడూ దానిని వేరుపరచలేదు. సంసార మహాసాగరంలో ఆ బిందుమాత్రధనం ఐక్యమయిపోయేది.

"ఏటి బాబూ అంత ఇంతగా సూత్తున్నారు? ఇదేటి తపట్నంలా ఉంటదా ఏటి? ఏదో పుట్టి పెరిగిన బూమని బతుకులు ఎళ్ళదీసుకోడం

కాని, సుకమాసంతోసమా? పెద్దబాబు గారున్నప్పుడు ఏ పండుగొచ్చినా, ఏ జాతరొచ్చినా గావ(ం, గావ( వ(ంతా ఒకటే కట్టుకదండి? ఇప్పుడ యన్నీ పోనాయి. ఏ సందడొచ్చినా ముందు మా పాట్టీ అంటే, మా పాట్టీఅంటూ కొట్టుకోడాలు, తిట్టుకోడాలు, మేము గాంధిగారి పాట్టీ అంటే మేము రైతోళ్ళ పాట్టీ అంటూ గొంతులు తెంచుకోడమేకాని, బాబూ, నాకు తెలకడుగుతాను—ఏ పాట్టీ వాడికయినా తిండి, తిప్పలు ముంద? పాట్టీ ముంద? అదేరికి పట్టదేటండీ?

"ఈ పాట్టీలలోబడి యవసాయం మీద సిన్నసూపు సూసింద్రు గావ(త్తులు. డబ్బున్న మారాజుల కేటిగాని, షూలాటి కూలోళ్ళం తిండి నేక చత్తున్నా మనుకోండి. పెద్దబాబుగారున్నప్పుడు ఈ కళ్ళంలో ధాన్నం కుప్పపోత్తే సుక్కల్ని తాకేత్తా ననేది. మరి ఆ బూములేగంద, పక్కగా సేద్దం సేసుకొంటే కడుపు నింపకుండా పోతాయా...."

నిజమే, అప్పుడు ఈ స్థలంలో పంట కళ్ళము ఉండేది. నూర్పిళ్లు, గాలికి పట్టడం వగైరా పనులన్నీ ఇక్కడే జరిగేవి. మరి ఈ ఇల్లు ఎప్పుడు, ఎవరు కట్టించేరు? ఒక్కసారి ఎగాదిగా ఇంటిని, పరిసరప్రదేశాలను పరికించి చూసేడు.

ఇల్లు నిరాడంబరంగా, ఆకర్షణీయంగా ఉంది ఇంటిని చుట్టివున్న ఖాళీ స్థలంలో రకరకాల పూలమొక్కలు, లతలు, కూరపాదులు పచ్చని ఆకులతో కళ్లకు విందు చేస్తున్నాయి దక్షిణం తెరపికి తెరిచి ఉన్న కిటికీల గుండా, పొలాలపై నుండి వీచిన పైరుగాలికి కిటికీతెరలు ఇటుఅటు కదులు తున్నాయి. మాయని పాలగచ్చులు వాటి వయో పరిమితిని తెలుపు తున్నాయి.

"ఈ ఇల్లు ఎవరిదోయి, పోలయ్యా?" ప్రశ్నించేడు అతడు.

పోలయ్య గుడ్లు తేలవేసుకు కలలో చూస్తున్నట్లు చూస్తున్నాడు.

"ఇదేటి, బాబూ! అలా అడుగుతున్నారు?" అన్నాడు ఆశ్చర్యంగా.

తడిచేతుల్ని తువ్వాలుకు తుడుచుకొంటూ వచ్చింది శారద!

"పోలాయి! బాబుగారి స్నానానికి నీళ్ళు సిద్ధం చెయ్యమన్నాను. చేసేవా?" అని ప్రశ్నించింది.

"ఇదిగో. సిన్నమ్మగారూ! నిముసంలో నీళ్ళు తోడుకురానా! బాబుగారు ఏదో అడుగుతూంటే మాటల్లోపడి...."

"మరేం....మాటలుంటే నీకు తిండి, నిద్రకూడా అక్కరలేదు. బాబుగారు రాత్రికూడా భోజనం చెయ్యలేదు. పైగా ప్రయాణపు బడలిక. వేగం స్నానంచేస్తే భోజనం చేస్తారు. ఊఁ పద. నువ్వింకా ఇక్కడే ఉన్నావా?"

పోలాయి పరుగు తీసేడు.

చిన్ననాటి పనివాళ్ళకు, పాలి కాపులకు, గొడ్ల కాపరులకు అజ్ఞలు జారీ చేస్తూ ఆ ఇంటికి రాణిలా ఇటు అటు తిరిగేది. అప్పట్లో అలా ఆజ్ఞాపించడం అంటే ఆమెకో సరదా. మిగిలిన మధ్యకాలంలో ఆమె అందరి అజ్ఞలను తలదాల్చి ఆచరించడమేకావి, ఆజ్ఞాపించినదే లేదు. ఈనాడు మళ్ళీ ఆ రూపంలో శారద....

అతనికంతా అయోమయంలా ఉంది. ఆతని ఆలోచనలను గమనించనట్లే, బ్రష్ టూత్‌పేస్టు చేతిలోపెట్టి, ఇంటిలోంచి నీళ్ళు పట్టుకొచ్చింది. దంతధావన కార్యక్రమం ముగించిన అతను చెంబుకై చెయ్యి చాచేడు.

"ఊఁ కడగండి. పోస్తున్నా" అన్నాది ఆమె.

గాపిరి నలపని అనుభూతులతో ఉక్కిరి బిక్కిరి అయేడు అతడు.

"మరి అంతసేపేమిటండీ చిన్న పిల్లాడిలా! పై మెంతయిందో

ఏమైనా ధ్యాస ఉందా? ఈ పద్ధతివి శ్రీవారి స్నానం అయేసరికి ఈ రోజూ వంటి పొద్దే అయేలాగుంది" అని తొందర పెట్టింది ఆమె.

*   *   *

"మీ భోజనం పూర్తయితే మీరు లేవండి. నేను ఇప్పుడే వస్తున్నాను. అంతవరకు గదిలో విశ్రమించండి" అన్నాది శారద. ఆమె మాటను ఆజ్ఞగానే భావించి, అడుగులో అడుగు వేసుకొంటూ గదిలో కాలు పెట్టేడు అతడు.

"ఇంతలోనే నిద్రపోయేరు సుమండీ! తాంబూలం తెస్తున్నాను" అని మరో హెచ్చరిక చేసింది ఆమె.

గదిలో ఇటు అటు పచారు చేస్తూ, ప్రతి వస్తువును అత్యంత కుతూహలంతో చూస్తున్నాడు అతడు. ఏ వస్తువును చూసినా ఏదో నూతనభావం గోచరిస్తున్నాది. అలవాటుచొప్పున టేబిలుపై ఉన్న రేడియో స్విచ్ వేసి తన మతిమరపుకి తనే నవ్వుకున్నాడు. ఈ కుగ్రామంలో ఎలెక్ట్రిసిటీ కూడా ఉంటుందా? అనుకొన్నాడు.

అతని అమాయకతను నిజంగానే పరిహసించింది రేడియో. ఇంగ్లీషు వార్తలు ప్రసార మవుతున్నాయి. రేడియోను ఇటు అటు తిప్పి చూసేడు. అది బాటరీమీద పనిచేసేది. దానిని శారద ఎప్పుడు కొన్నాదో అతనికి తెలియనే లేదు.

వార్తలలో ఏదో ఎయిర్‌క్రాష్‌లో మరణించిన ప్రయాణీకుల గురించి చెప్తున్నారు. ఒక్కసారిగా అతని గుండె దడదడలాడింది. ఉన్న వళంగా మనిషి మంచంపై వాలిపోయేడు. అంతా ఒక లిప్తకాలం మాత్రమే. ఒక్కసారిగా భారం తీరినట్లు 'హమ్మయ్య' అనుకొన్నాడు. తలక్రింద ఉన్నదిండునానుకొని అలాగే కళ్లు మూసుకొన్నాడు.

"అమ్మాయి, అల్లుడు క్షేమంగా చేరినట్లు మొన్ననేకదా కేబిల్

మోపేజి వచ్చింది? ఇప్పుడీ విమాన ప్రమాదంగురించిన వార్తని కంగారు పడ్డాడు తను. చల్లచల్లగా వృద్ధాప్యం తనలో చోటు చేసుకొంటున్నాది. జ్ఞాపకశక్తి తగ్గిపోతున్నాది' అనుకొన్నాడు.

* * *

గడిచిన పదిహేను రోజుల గాథ జ్ఞప్తికి తెచ్చుకొందుకు కొంత ప్రయాస పడవలసే వచ్చింది అతనికి. ఆ రెండు వారాలు ఎంతరద్దీగా దొర్లిపోయేయని! ఇంటా, బయటా ఒకటే హడావిడి. పార్టీలు, డిన్నర్లు, ఊపిరి సలపందే! అవును, ఉద్యోగకాలంలో అయిన పరిచయాలు, స్నేహాలు ఆయెను. ఇన్నాళ్ళకు తమ స్నేహితుడు తమను వదిలి వెళ్ళి పోతున్నాడంటే, ఆ మాత్రం ఆర్భాటం చెయ్యరా, మరి?

తన ముప్ఫయి ఏళ్ళ సర్వీసులోను, ఏదో విధాన తననుండి సహాయం పొందనివాడు లేడు. అందరిదగ్గర మంచిగా, మన్ననగా నడుచుకోవడం అంటే తనకు చిన్ననాటి నుండి ఇష్టం. మంచిగా చెప్పి మనుష్యులచేత పనులు చేయించుకోవచ్చు. దండించి, తిట్టి చేయించుకొనే కాలం పోయింది అని తన నమ్మకం.

ఆ మంచితనమే అధికారులచేతకూడా ఇలాటిమనిషి వెళ్ళిపోతే ఎలా అనిపించేలా చేసింది. కావాలంటే ఒకటి రెండేళ్ళు సర్వీసు పొడిగిస్తా మన్నారు. తనే వద్దన్నాడు.

తను మోయవలసినవి, చేయవలసినవి ఏమీలేవు. కొడుకు శ్యామసుందరం పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. కూతురు విజయకు పెళ్ళిచేసి, అత్తింటికి అంపకం పెట్టడం కూడా జరిగిపోయింది. విజయ అత్తవారు కలిగినవారు, అల్లుడు పెద్దచదువులు చదివినవాడు. ఇంక ఆడపిల్ల చింత తనకేమీ ఉండనక్కరలేదు. మిగిలింది తనూ, శారదా. తమ ఇద్దరి జీవి

తాలికు తగిన ఆధారం ఉంది. ఇంక దేనికి ఉద్యోగం? చేసినన్నాళ్ళు మంచిగా నలుగురిచేత "ఔ" ననిపించుకొన్నట్లు చేసేడు. 'అంతేచాలు' అనుకొన్నాడు అతడు.

అప్పటివరకు అన్నీ సవ్యంగానే జరిగిపోయేయి. మీరు రిటైరు అయిపోతున్నారు కాబట్టి నా దగ్గరికి వచ్చి వుండండని బ్రతిమిలాడేడు కొడుకు శ్యామసుందరం. "ఏడాదికల్లా అమెరికా నుండి తిరిగి వచ్చే స్తాము. మేము వచ్చేకమాత్రం నా దగ్గరే ఉండాలి" అని అడ్వాన్సు బుకింగు చేసుకొంది కూతురు విజయ.

అక్కడే ఏదో చిన్న అపశ్రుతి పలికింది. ఆ రాత్రి విమానంలో విజయ, మోహను బయలుదేరుతారు. మధ్యాహ్న భోజనాలు ముగించి, అంతా సావిట్లో కూర్చున్నారు చెల్లెలిని, బావమరిదిని సాగనంపడానికి శ్యామసుందరం భార్యా సమేతుడయి వచ్చేడు.

తల్లి పక్కగా చేరింది విజయ. ప్రేమతో దగ్గరికి తీసుకొన్నాది శారద.

"అమ్మా!" అన్నాది విజయ మెల్లగా.

"ఏమమ్మా?" అని ప్రశ్నించింది శారద.

"నాకు కొంచెము సొమ్ము కావాలమ్మా."

శారద మాట్లాడలేదు.

"వెళ్ళేది విదేశం. ఎన్నో కొనుక్కొందుకు ఉంటాయి. ఒక రెండువేల రూపాయలుంటే ఇయ్యమ్మా" అన్నాది విజయ.

తల్లి జవాబు చెప్పకపోగా తిరిగి తనే మాట్లాడింది

"శేషాచలరావుగారని, మీ అల్లుని స్నేహితుడొకాయన అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. ఆయన తలిదండ్రులకి ప్రతినెలా కొంత సొమ్ము పంపుతారుట. ఆ సొమ్ము మనం ఇక్కడ ఇచ్చేస్తే అక్కడ

ఆయనదగ్గర డాలర్లు తీసుకోవచ్చు" అన్నాది అసలు సంగతి బోధ పరుస్తూ.

"నా దగ్గర అంత సొమ్ముంలేదమ్మా" అన్నాది శారద.

దెబ్బతిన్న లేడిలా బెదిరిపోయింది విజయ. కంటిపొరలలో నీరు కదలసాగింది. ముఖం ఇంత చేసుకొని పక్కకు తిప్పుకొంది.

"ఏమిటి, విజయా?" అని ప్రశ్నించేడు శ్యామసుందరం.

"ఏం లేదు, అన్నయ్యా" అన్నాది విజయ విరక్తిగా.

"ఏమయింది, శ్యామలా?" భార్యను నిలదీసేడు శ్యాం.

"విజయకి రెండువేల రూపాయలు కావాలిట" అన్నాది శ్యామల.

"ఇయ్యి, శారదా! కొత్తగా కాపురానికి వెళ్ళినపిల్ల. నిన్నుగాక మరెవరిని అడగగలదు. చిన్నపిల్లలు—విదేశాలలో అనేకమైన వేడుకలు, సరదాలు ఉంటాయి. ఇప్పటి కోర్కెలు ఇంకో సమయంలో ఉంటాయా" అన్నాడు తండ్రి

నా దగ్గర సొమ్ములేదు" అన్నాది శారద నిశ్చలంగా. అందరి దృష్టులు ఆమెపై కేంద్రీకృత మయేయి. అతి సున్నితమైన ఆ సంభాషణ మధ్య తానుండడం అంత బాగుండదనుకొన్నాడు అల్లుడు మోహన్. "ఒకసారి బజారుకి వెళ్ళవలసిన పని ఉంది మళ్లా అరగంటలో తిరిగి వస్తాను" అని భార్యతో చెప్పి మెల్లిగా జారుకొన్నాడు.

"అదేమిటమ్మా! విజయ నోరువిడిచి అడుగుతే, అలా అంటున్నావు" అని నిలదీసేడు శ్యాం.

అందరికీ అదే జవాబు.

"నీ కెంత కావాలో నే నిస్తాను. పట్టుకెళ్ళమ్మా" అన్నాడు తండ్రి.

"ప్రస్తుతం నా దగ్గర అంత సొమ్ములేదు. కాని, ఆ శేషాచలరావు

గారి తండ్రి అడ్రసు నా కియ్యి. బొంబాయి వెళ్ళగానే మనిఆర్డరుచేస్తాను" అన్నాడు అన్న.

ఏ వస్తువు కొరకైనా అడిగి లేదనిపించుకోడం ముఖ్యంగా తల్లి దగ్గర విజయ జీవితంలో అదే మొదటిసారి. అమ్మను అడిగి లేదనిపించు కొన్నానని అసలే బాధపడుతున్న ఆ అభిమానవతి అందుకు ఒప్పుకో లేదు.

"నీ సొమ్ము వద్దన్నానని మరోలా అనుకోకు, అన్నయ్యా. మీ దగ్గర సొమ్ము తీసుకొని అమ్మని న్యూనత పరచలేకపోయేను. ఈ మధ్య అమ్మ ఎందుకో మారిపోయింది ఆమెలో ఇంత డబ్బు ధ్యాస ఉందని నే నెన్నడూ అనుకోలేదు" అన్నాది చాటుగా.

"నాన్నగారూ అదే మాట అన్నారు, విజయా! ఆమె పంటల సొమ్ముకూడ నాలుగు సంవత్సరాలయి బాంకులో జమ కాలేదుట. ఏమిటి చేస్తున్నాదో ఆయనకి తెలియదుట" అన్నాడు శ్యాం.

"అత్తగారికి డబ్బు ధ్యాస అంటే నమ్మలేకుండా ఉన్నాను" అన్నాది శ్యామల.

ఎవరి మనసులలో వారికి ఎన్నో సంఘటనలు కదలసాగేయి. అంతకు నెలరోజులక్రితమే తన నగలన్నీ కోడలికి, కూతురికి పంచి ఇచ్చింది. పెట్టెలనిండా ఉన్న పట్టుచీరలలో రెండుమాత్రం తను తీసు కొని, మిగిలినవి "ఎవరికి కావలసినవి వారు తీసుకోండి" అన్నాది. ఆ రెండూ అతి పురాతనమై, అక్కడక్కడ చిరుగుచూపిన చీరలు. ఒకటి ఆమె పెళ్ళినాటిది రెండవది నవ వధువుగా ఆ ఇంట ఆమె కాలుమోపి నప్పుడు ధరించినది.

ఇంటిలోని ప్రతి వస్తువును అవసరాలబట్టి కొడుక్కు, కూతురుకు

పంచివేసింది. ఆమె మాటలను, చేష్టలను చూసి అందరూ దిగులు పడ్డారు.

"ఇదేమిటమ్మా! నువ్వు అన్నీ వదిలి ఎక్కడికో వెళ్ళిపోతున్నట్లు ఈ ఏర్పాట్లు" అన్నాడు శ్యామసుందరం దిగులుగా.

"లేదు, నాయనా! అన్నీ మీ కిచ్చివేస్తున్నానని భ్రాంతి పడుతున్నారు. నేను వదలంది; వదలలేనిది ఒకటి ఉన్నాది. దానినిమాత్రం నాకు వదలండి" అన్నాది.

"నీ నగలు, చీరలు నువ్వున్నంతకాలం నీ ఒంటిమీద ఉండవలసినదే, అమ్మా. వాటిని మే మెవరం ధరించలేం" అన్నాది కూతురు.

"పిచ్చిపిల్లా! కట్టుకొన్నన్ని రోజులు కట్టుకొన్నాను. పెట్టుకోవలసినన్నిరోజులు పెట్టుకొన్నాను. సంఘానికి, సభ్యతకి తగినరీతిగా గడపవలసిన జీవనం గడిచిపోయింది. ఇంకా ఈ నగలు, చీరలమీద వ్యామోహ మెందుకమ్మా నాకు" అన్నాది.

అందరి మనసులలో ఏదో దిగులు అలముకొన్నాది. దిగులులేనిది శారద ఒక్కతే. ఏవో మధురమయిన ఊహలలో, కలలలో తేలిపోతున్నట్లు; ఎన్నాళ్ళుగానో మోస్తున్న బరువును దింపి, తేలికపడిన కాళ్ళతో గాలిలో తేలిపోతున్నట్లు ప్రవర్తించ సాగింది.

పార్టీలలో, డిన్నర్లలో, తమ భావి కార్యక్రమంగూర్చి ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా మాట్లాడేది. అంతకుపూర్వము తూచి తూచి మాట్లాడే ఆమె అంత ఉత్సాహంతో మాట్లాడడం అందరికి క్రొత్తగానే అనిపించింది. ఒకరిద్దరు చాటుగా, "ఈమె కేమయింది" అని అనుకోవడంకూడా జరిగింది.

విజయ, మోహన్ సురక్షితంగా చేరుకొన్నారన్న కేబిల్ మెసేజి అందుకొన్నాక శ్యామసుందరం ప్రయాణమయేడు. "మరి నాలుగు రోజులు ఉండరాదురా" అన్నాడు తండ్రి.

"సెలవులేదు, నాన్నా! మళ్ళా మీ రెప్పుడు రమ్మంటే అప్పుడు వస్తాను" అన్నాడు.

రైలు కదులుతూండగా తండ్రిని హెచ్చరించాడు కొడుకు. "అమ్మని జాగ్రత్తగా చూడండి, నాన్నా! ఒకసారి డాక్టరుకి చూపడం మంచిదేమో? ఏ పరిస్థితులలోనూ ఆమె మాట కాదనకండి" అన్నాడు.

కోడలి చేతులు పట్టుకొని, "జాగ్రత్తగా వెళ్ళిరండమ్మా" అన్నాది ఆమె.

తల్లి కన్నులలోకి తరిచి చూసేడు తనయుడు. నిర్మలంగా ఉన్న ఆ కళ్ళలోని జ్యోతి అతని కళ్ళలో ప్రతిఫలించింది. ఆ కళ్ళను ఏనాడో తన చిన్నతనంలో చూసిన జ్ఞాపకం అతనికి. మళ్ళా ఇంతకాలానికి ఆ కళ్ళలో తళుకు...."అమ్మ అర్థంకాని మనిషి" అనుకొన్నాడు కొడుకు.

* * * *

గదిలో అడుగుల చప్పుడయింది. ఏ ప్రోగ్రాంలేక బరబరలాడు తున్న రేడియోను నిలిపివేసిన శబ్దం. మెల్లగా అతని నుదుటిని తాకి చూస్తున్నారు ఎవరో. అతనికి కళ్ళు తెరవాలనే ఉంది. ఉప్పెనలా వస్తున్న ఆలోచనలను నెట్టుకు లేవాలనే అనిపించింది. కాని లేవలేదు. కళ్ళు తెరవలేదు.

"ఇంతలోనే, ఎంత నిద్ర!" అతి సున్నితమయిన చుంబనాన్ని అందుకొన్నాది అతని ఫాలభాగం.

• • • •

ఆలోచనలు వలయాలు తిరిగి అతన్ని ఆక్రమించుకొంటున్నాయి. నాలుగడుగుల దూరంలో ఆమె ఎవరితోనో మాట్లాడుతున్నాది.

"సామానంతా జాగ్రత్తగా చేరిపోయిందమ్మా! ఇంక మీరు

బయలుదేరడమే తరవాయి. ప్లీడరుబాబు రెండుమూడు రోజులతో మిమ్ము కలుసుకొంటామని చెప్పమన్నారు."

"ఎవరది? జగన్నాయకులా?" ప్రశ్నించేడు అతడు.

"అవును, బాబూ, నేనే!"

"కారు సిద్ధంగా ఉందా?"

"చిత్తం, బాబూ" అన్నాడు.

ఇద్దరూ వెళ్ళి కారులో కూర్చున్నారు. ఆలోచనలతో అలసిన అతడు శరీరాన్ని సీటుకు చేరవేసి కళ్ళుమూసేడు. ఆమె ఏదో చెప్పింది. కారు కదిలింది. గంటపైగా గడిచినా కారు ఆగలేదు. అతడు కళ్ళు తెరిచి చూసేడు. అపరిచితమయిన రోడ్డుపై కారుపోతున్నది.

"మనం ఎటుపోతున్నాం, శారదా?" అన్నాడు.

"మనింటికి" అన్నాది ఉత్సాహంగా ఆమె.

ఆమె కళ్ళలోకి చూసేడు ఏదో కొంటెతనం కదులాడుతున్నాది ఆ కళ్ళలో.

"ఏ పరిస్థితులలోను అమ్మ మాట కాదనకండి, నాన్నా!" తన యువి మాట తలపుకొచ్చింది.

నాలుగైదు గంటలు ప్రయాణంచేసి కారొక ఇంటిముందు ఆగింది. అతనికంతా ఏదో మైకంలా మగతగా ఉంది. ఏభై సంవత్సరాలుగా పని చేసిన శరీరం, ఆ పనికంతా అప్పుడే విశ్రాంతి కావాలంటున్నాది.

శారద సహాయంతో పక్కమీదికి చేరేడు. కొద్ది సేపట్లో శారద తిరిగివచ్చింది. "భోజనం చేద్దురుగాని, లెండి" అన్నాది.

"ఆకలిగా లేదు" అన్నాడు అతడు.

అతని కళ్లు విడివడలేదు. మనసు ఆలోచించడం మానింది.

శరీరం కదలనంది. చావుకు, బ్రతుక్కు-మధ్యగా ఉండే ఏదో వింత పరిస్థితికి వచ్చింది అతనిస్థితి.

జీవితంలో తానింతగా అలిసిపోయానని అతడు ఎన్నడూ తలచనే లేదు. అతనికి విశ్రాంతి కావాలి. శారీరకంగా, మానసికంగా, ఆలోచనలు, అపోహలు, భయాలు అన్నిటికి అతీతమయిన ప్రశాంతత కావాలని గోల పెట్టింది అతని మనసు.

గోరు వెచ్చని గ్లాసుడు పాలు అతనిచే తాగించింది శారద. తల క్రింద తలగడ సర్ది, దీపాన్ని తగ్గించి వెళ్ళిపోయింది.

* * *

"ఇంకా నిద్ర తీరలేదా?" అతనిని లేపుతున్నాది శారద. ఆలోచనలమధ్య ఎప్పుడు నిద్ర పట్టిందో అతనికి తెలియనేలేదు. టేబిలుమీదున్న అలారమ్ టైమ్‌పీసు నాలుగు గంటలు చూపుతున్నాది.

"చాలాసేపు నిద్రపోయా నన్నమాట!" అనుకొన్నాడు అతడు.

కాఫీ తాగుతుండగా, "కరణంగారు వచ్చేరమ్మా" అన్నాడు పోలాయి.

"రండి, బాబాయిగారూ! రండి" అని ఆహ్వానించింది శారద. అతనికి కూడా కప్పుతో కాఫీ అందించింది.

"ఇప్పుడిదంతా ఎందుకమ్మా! నీ జమా ఖర్చులు చూపి, మిగిలిన పైకం ఇచ్చిపోదామని వచ్చేను. ఇదిగో, ఈ కాగితం చూడు; ఇది గుమ్మాలకయిన సొమ్ము; ఇది ఇటుకలు, సున్నం.... ఇది...."

"ఆ కాగితం అలా ఉండనీండి. నే చూడ దలుచుకోలేదు. మీ లెంకేమీ నాకీయనక్కరలేదు. నన్ను మీ బిడ్డలా చూసుకొని, నే కోరిందే తడవుగా ఇంత శ్రమపడ్డారు. మీ ఋణం తీర్చుకోలేనిది" అన్నాది ఆమె.

"నీ అభిమానం అలాటిది కాని, నే చేసింది ఏ ముందమ్మా! మళ్ళా వస్తాను" అంటూ వెళ్ళిపోయేరు కరణంగారు.

*

* *

అతనిలోని మైకం ఒక్కసారిగా దిగిపోయింది. కడిగిన అద్దంలోని ప్రతిబింబంలా, అన్ని ప్రశ్నలకు సమాధానాలు అడగకుండా ఎదుట నిలిచేయి. అయినా ఆమె నోటిమీదుగా వినాలి. అదే అతని అభిలాష.

భోజనం పూర్తిచేసి మల్లె పందిరి పక్కగా వాలుకుర్చీలో కూర్చున్నాడు అతడు. చంద్రుడు నిర్మలాకాశంలో తనరాజ్యం నెరపుతున్నాడు. అరవిచ్చిన మల్లెపూలు చంద్రకాంతినే గేలి చేస్తున్నాయి. రెండు గ్లాసులతో పాలు పట్టుకువచ్చింది శారద. పక్కనే ఉన్న బల్లను అతనిదగ్గరగా లాక్కొని కూర్చుంది. తెల్లని ఉప్పాడ జరీచీరలో మిలమిలా మెరిసిపోతున్నాది ఆమె దేహచ్ఛాయ. నుదుటిపై ముడతలు, వాలిన బుగ్గలు ఆమెకో నూతన సోయగం చేకూరుస్తున్నాయి. గాలికి ఇటు అటు కదిలే ముంగురులు, తలలోని మల్లెలతో మాట కలుపుతున్నాయి. తరగని, అరగని ఆమె సౌందర్యాన్ని నేత్రాల నిండా నింపుకొంటున్నాడు అతడు.

"పాలు తీసుకోండి." అతనికో గ్లాసు అందించింది.

"ఒక్కమాట అడగనా, శారూ!"

అవును. అతడు అడగబోయే దేమిటో ఆమెకు తెలుసు. ఈ దృశ్యాన్ని ఏళ్ళ తరబడిగా రిహార్సలు చేసుకొన్నాది ఆమె. అతను ఏవో అడుగుతాడు. తాను అన్నీ చెప్తుంది. సభ్యత, సంస్కారం, స్నేహితులమధ్య పడి తామొకరి కొకరు ఎంత దూరంగా నిలిచిపోయింది; తమ ప్రసక్తి లేకనే తమ ఇరువురిమధ్య ఎన్ని తెరలు, ఎంత అగాధం ఏర్పడినది; ఒకే గృహంలో ఉంటున్నా తమ జీవన మార్గాలు ఏ విధంగా వేరుపడింది—అన్నీ చెప్తుంది. అతనికి అతని స్నేహితులు, ఉద్యోగం;

ఆమెకు గృహకృత్యాలు, మహిళా సభలు, సమావేశాలు. ఒకరి పరిధి లోకి ఇంకొకరు చొరనేరనంతగా గిరులు గీసుకొన్నారు ఇద్దరూ. ప్రమాద వశాత్తూ ఏనాడైనా ఒకటిగా తారసిల్లినా, ఆ అవకాశాన్ని పాడుచేయుడానికి అనంతమైన అడ్డంకులు. జీవితమనే గాడిలోపడి,వలయాలు తిరిగే గానుగ ఎద్దుల చందమైంది వారి బ్రతుకు.

ఇదేనా జీవితం? ఇలాగే పూర్తి కావాలా? ఇంకోవిధంగా దానిని మలుచుకొనే మార్గమే లేదా? "ఉంది. లేకేమి?" అన్నాది ఆమె మనసు. ఆ ఆశాకిరణమే ఆమెకు చేయూత నిచ్చింది. ఒకానొకనాటికి ఈ శృంఖలాలనుండి విముక్తి దొరుకుతుంది. ఆనాడు తమకు నచ్చినరీతిగా మనసు మెచ్చిన రీతిగా వారు జీవించవచ్చు. ఆ జీవనమంతా వారిదే. పెరవారికి అందులో చోటులేదు.

ఆ గమ్యాన్ని చేరుకోడానికి ఎన్నో పంచవర్ష ప్రణాళికలు రచించిందామె. బిడ్డల భవిష్యత్తు, ఆర్థికస్తోమతు, శరీర దార్ఢ్యం, హృదయ నైర్మల్యం ఇవన్నీ జీవిత సంగ్రామంలో ప్రణాళికాబద్ధంగా ఆమె సాధించిన విజయాలు.

ఈనాడు వారిని బాధించే సమస్యలే లేవు. ఉన్న ఆస్తిని బిడ్డలిద్దరికి సమంగా పంచి వీలునామా ఏర్పాటు చేయించింది కొద్దిరోజులలోనే చట్ట సమ్మతమనే ముద్ర దానిపై పడుతుంది. తమ ఇద్దరి జీవితాలకు ఈ ఇల్లు, ఆ పొలం, అతని పెన్షను కావలసినకన్నా అధికం.

తమ శాంతిని, నైర్మల్యాన్ని పాడుచేసే పట్నవాసంనుండి, బంధుమిత్రులనుండి, సామాజిక బంధనాలనుండి దూరంగా తొలగిపోయేరు. ఈ ప్రశాంత వాతావరణం గాడి తొలగిన వారి హృదయాలను పునరుద్ధరిస్తుంది. వారి జీవితంలోని ఆఖరి ఆశ్వాసాన్ని ఆనందంగా వ్రాసి

ముగించే అవకాశం లభ్యమవుతుంది. ఈ నిలకడ జీవనంలో. అదే ఆమె కోరిక; దానికోసమే ఆమె తపస్సు.

ఆమె మనసునే అనుసరిస్తున్నాయి అతనికళ్ళు.

అరనెరసిన అతని జుట్టును సవరిస్తూ, "ఇది మన ఇల్లు" అన్నాది ఆమె.

ఆ మాటలో ఆమె హృదయమంతా ప్రతిఫలిస్తున్నాది. వాక్కుతో తెలుపలేని ఎన్నో సంగతులు తెలియజేస్తున్నాయి ఆమె కళ్ళు.

"అవును. మనదిమాత్రమే" అన్నాడు అతడు సంతృప్తిగా.

...(o)..